క్లుప్తంగా

29న అంబేడ్కర్ జాతర

ధన్వాడ: అంబేడ్కర్, ఫులే జాతర ఈ నెల 29న నిర్వహించనున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గండిబాల్‌రాజు గురువారం తెలిపారు. కిష్టాపూర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాలరాజు, సత్తయ్య, వెంకటయ్య, చెన్నప్ప, కడపయ్య, గోవిందు, కతలయ్య, నాగన్న, సాయిలు, అంజయ్య, బాలకృష్ణయ్య, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

దామరగిద్ద: మండల కేంద్రంలోని విండో కార్యాలయంలో శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లుఅధ్యక్షుడు ఈదప్ప, కార్యదర్శి మురారీ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా భగీరథ జయంతి



మాగనూర్: పట్టుదలతో కృషిచేస్తే ఎంతటి లక్ష్యమైనా సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని వడ్వాట్ సర్పంచ్ నర్సిములు అన్నారు. గురువారం గ్రామంలో భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రవీందర్, ఉప సర్పంచ్ సరస్వతి, రాములు, ఉప్పరి బీషప్ప, నరేందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: లంకాల్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కోశాధికారి విష్ణుసాగర్, నాగరాజుసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, రామకృష్ణసాగర్, రవిసాగర్, పాండు, పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తిచేయాలి

మద్దూరు: మండలంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ జ్యోతి అధికారులకు ఆదేశించారు. గురువారం మండలంలోని నందిపాడ్ గ్రామంలోని పాఠశాల ఆవరణలో చేపట్టిన ఇంకుడు గుంత నిర్మాణాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. మండలంలో మూడు రోజులుగా 10 కమ్యూనిటీ ఇంకుడు గుంతలను, అలాగే మరో 20 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినట్లు ఎంపీడీఓ తెలిపారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు అవసరమైన వారు ఆయా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు. సర్పంచ్ బుడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ప్రజావాణి

నర్వ: తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ దయాకర్ రెడ్డి ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావాణికి జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజావాణిలో రెవిన్యూ అధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మక్తల్: మండలంలోని పంచలింగాల లో గజ్జలమ్మ ఆలయం వద్ద నూతనంగా తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని సర్పంచ్ తిమ్మక్క తెలియజేయడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

నారాయణపేట టౌన్ : పట్టణంలో రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి ప్రధాన మురుగు కాల్వలో ప్లాస్టిక్ వర్థ్యాలు, చెత్తాచెదారం నిండి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సివిల్ లైన్, మున్సిపల్ పార్కు రోడ్డు, సత్యసాయి కాలనీ, సాయివిజయ్ కాలనీల్లో పరిస్థితి అధ్వానంగా ఉందని వాపోతున్నారు. దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద పెరిగి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే మురుగు కాల్వలు పరిశుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ప్రదర్శన

దేవరకద్ర: మండలంలోని బస్వాపూర్‌లో గురువారం రాత్రి సురక్ష పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బాల్య వివాహాలు, అత్యాచారాలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, మూఢనమ్మకాలు, లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, కుల వివక్ష, ప్రేమ పేరుతో మోసాలు, కరోనా వైరస్ వంటి అంశాలపై ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచాలకు సంబంధించి ప్రజలకు వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మోసాలను నమ్మవద్దని సూచించారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు



విఠలాపూర్‌లో పనులు చేస్తున్న కూలీలు

దామరగిద్ద: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. పథకంలో వ్యవసాయ అనుబంధ పనులను ప్రాధాన్యం ఇవ్వడంతో పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఫిష్‌పాండ్స్, ఫీడర్ ఛానల్స్, స్టోన్ బండింగ్(సాగు భూముల్లో గులకరాళ్ల ఏరివేత), మట్టి కట్టల నిర్మాణం వంటి జోరుగా చేస్తున్నారు. మండలంలోని 30 జీపీల పరిధిలో 12 వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 7171 యాక్టివ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం 2200 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. కాగా వీరికి రోజు కూలి గతంలో రూ.257 ఉండగా ఈ ఏడాది రూ.272 కు పెంచారు. కానీ వేసవి అలవెన్సులు మాత్రం ఇవ్వడం లేదు. అయితే మార్చి 31 వరకు చేసిన పనులకు సంబంధించి రూ. 59 లక్షల కూలీ డబ్బులు ఖాతాల్లో జమ చేశారు.

కొనసాగని మట్టిరోడ్ల పనులు

ఇదిలా ఉంటే రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న మట్టిరోడ్ల మరమ్మతు ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు అవకాశం ఉన్నా ఏగ్రామంలోనూ పనులు చేపట్టడం లేదు. మట్టిరోడ్ల నిర్మాణానికి 60 శాతం పనులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల్లో కందకాలు తవ్వి తీసిన మట్టితో రోడ్డుకు వేయాల్సి ఉంటుంది. మిగిలిన 40 శాతం మట్టిని ఇతర ప్రాంతాల నుంచి తరలించుకోవడానికి అవకాశం ఉంది. కాగా రోడ్లకు ఇరువైపుల పొలాల్లోంచి మట్టిని తీసి రోడ్డుకు వేసేందుకు రైతులు నిరాకరిస్తుండటంతో పనులు జరగడం లేదని అధికారులు అంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో కూలీలు ఉదయమే పనులకు వెళ్లి ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేసుకుంటే మంచి కూలి పొందడానికి ఆస్కారం ఉంది. మార్చి 31 వరకు ఉపాధి పనులకు సంబంధించిన రూ. 59 లక్షలను ఇప్పటికే కూలీల పోస్టల్ ఖాతాల్లో జమ అయ్యాయి. వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఉన్నందున కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

–రవికుమార్, ఏపీఓ, దామరగిద్ద

చిన్ననాటి నుంచే కళలపై పట్టు సాధించాలి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని బాలకేంద్రం చిన్నారులకు గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటుకు ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, పెద్ద ఎత్తున చేపట్టిన ఉద్యమ ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. పార్లమెంట్‌లో ప్రకటన చేసిన రోజును పురస్కరించుకుని చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించుకున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో కళలకు చక్కటి ప్రాధాన్యత దక్కిందన్నారు. పిల్లలు చిన్ననాటి నుంచే సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్, జ్ఞానామృత, బీఆర్‌ఎస్ నాయకులు రాంరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్, రామకిష్టాయిపల్లి, మందిపల్లి గ్రామాల్లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మాధవరెడ్డి , విమల, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు గండిబాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలిన కార్మికులు



కోటకొండ తరలుతున్న నాయకులు

నారాయణపేట రూరల్ : సమస్యల సాధనకు హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున జీపీ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎదురింటి నర్సింహులు మాట్లాడుతూ.. జీపీ కార్మికుల నాలుగు నెలల జీతాలు వెంటనే విడుదల చేసి, 30శాతం పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.5లక్షల ఇన్సూరెన్స్, కేటగిరీల వారీగా విభజన చేపట్టాలన్నారు. వారాంతపు, పండగ సెలవులు ప్రకటించాలని, సర్పంచులు, సెక్రెటరీల నుంచి వేధింపులు లేకుండా చూడాలని కోరారు. జిల్లా నాయకులు రాంచందర్, అంజిలప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ పాకెట్ల పంపిణీ



ఊట్కూరు: చిన్నపొర్లలో గురువారం ఉపాధి హామీ కూలీలకు ఎంపీడీ ఓ కాలప్ప ఓఆర్‌ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున్న పంపిణీ చేపట్టామన్నారు. ప్రతిరోజు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, సర్పంచ్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాలతో మభ్యపెడుతున్నారు'



మాట్లాడుతున్న బొదిగెలి శ్రీనివాస్

ధన్వాడ: ఆత్మీయ సమ్మేళనాల పేరుతో నియోజకవర్గ ప్రజలను అధికారపార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మభ్యపెడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొదిగెలి శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏం చేశారని ఆత్మీయ సమ్మేళనాలు పెట్టారని ప్రశ్నించారు. ఎంతమంది పేదలకు మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ చేశారో చెప్పాలన్నారు. పేదల జీవితాలు మారాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పేట నుంచి బహుజన బిడ్డను అసెంబ్లీకి పంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్, హన్మంతు, రవియాదవ్, బాల్‌రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

జాతరలో రెట్టపట్ల పోటీలు



దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా గురువారం రెట్టపట్ల పోటీలను నిర్వహించారు. ముగ్గురిని ఓడించిన వారిని టెంకాయ, శాలువాతో సన్మానం చేశారు. ఐదుగురిని ఓడించిన వారికి వెండి కడియం బహుమతిగా అందజేసి సత్కరించారు. గ్రామ సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు తిప్పణ్ణ, చంద్రశేఖర్, గ్రామస్తులు క్రీడాకారులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు



కొల్లంపల్లిలో మొరం తవ్విన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నారాయణపేట రూరల్ : ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతిగా మట్టి(మొరం) అక్రమంగా తరలిస్తున్నారని కలెక్టర్ శ్రీహర్షకు నేరేడ్‌గామ్ పీఠాధిపతి పంచమసిద్ధలింగేశ్వర మహాస్వామి గురువారం ఫిర్యాదు చేశారు. నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామ శివారులో 851, 852, 854 సర్వే నెంబరు ఉన్న భూమి మఠం ఆధీనంలో ఉందని, తన పేరుతో పట్టా ఉందని తెలియచేశారు. ఆ భూమి నుంచి అర్ధరాత్రి అక్రమంగా సంతోష్‌రెడ్డి జేసీబీ సహాయంతో మొరం తవ్వి మట్టిని టిప్పర్ల సహాయంతో తరలిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ స్థానిక తహసీల్దార్ దానయ్యను పరిశీలించి రిపోర్టు ఇవ్వాలని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో వెంటనే స్వామిజీతో కలిసి తహసీల్దార్ కొల్లంపల్లికి వెళ్లారు. స్థలాన్ని పరిశీలించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దూరు: సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు ఇటీవల వేసిన బీటీ రోడ్డుకు పక్కన మొరం వేయలేదని బండగొండ ఎంపీటీసీ సభ్యురాలు రేణుక గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు పూర్తి అయినా సైడ్‌కు మొరం వేయలేదని, దీంతో వాహనాల డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే సైడ్‌కు దిగడం కష్టంగా మారిందని, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఇక భారీ వాహనాలు తిరుగుతుండటంతో తక్కువ రోజుల్లోనే రోడ్డు కోతకు గురైయ్యే అవకాశం ఉందని వెంటనే మొరం వేయించాలని కోరారు.

అధ్యక్షుడిగా అంబదాస్

మక్తల్: లయన్స్ క్లబ్ బీమా మక్తల్ నూతన అధ్యక్షుడిగా అంబదాస్ రావు ఎన్నికయ్యారు. మూడేళ్లుగా కోశాధికారిగా పనిచేసిన ఆయనను గురువారం జరిగిన బీఓడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా చంద్రకాంత్‌గౌడ్ వ్యవహరించారు. అనంతరం అంబదాస్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న జైపాల్‌రెడ్డి, కార్యదర్శి డీవీచారీ, జోన్ చైర్మన్ రమేష్ రావు, బస్వరాజ్, మహిపాల్‌రెడ్డి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు..

నారాయణపేట రూరల్ : జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్, శ్రీసత్యనారాయణ చౌరస్తా, వీరసావర్కర్ సర్కిల్, ఆర్డీఓ కార్యాలయం మీదుగా ధర్నా చౌక్ వరకు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. కాగా ర్యాలీని కలెక్టరేట్ వైపునకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కొందరిని అనుమతించడంతో వారు కలెక్టర్ శ్రీహర్షను కలుసుకుని సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కార్యాచరణ జిల్లాలో అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, శివకుమార్, బబిత, అనురాధ, నవిత, శ్రీనివాస్, బస్వరాజ్, రాములు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పాలిసెట్, స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ గురువారం ప్రారంభించారు. హెచ్‌ఎం రమేష్‌శెట్టి ఆధ్వర్యంలో 15 రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న వైద్యాధికారి

మాగనూర్: సీపీఆర్ నిర్వహించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని ప్రతి ఒక్కరు ఈ విధానంపై అవగాహన కలిగి ఉండాలని మాగనూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్ అన్నారు. గురువారం ఎంపీడీఓ సమావేశం మందిరంలో మండలవైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరోనా తరువాత చిన్న వయసు వారికి కూడా గుండెపోటు వస్తోందని, అత్యవసర సమయంలో డాక్టర్ కోసం వేచి చూడకుండా సీపీఆర్ చేస్తే ప్రాణాలు రక్షించవచ్చని వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రంజిత్, ఎస్‌ఐ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తులను సీపీఆర్ ప్రక్రియ ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోవచ్చని వైద్యాధికారి నాగజ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కిష్టమ్మ, ఎంపీఈఓ రమణ, ఎస్‌ఏ వెంకట్రాములు, ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రూప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊట్కూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్ గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, డా.అబీబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి దీక్ష



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వీఓఏలు

మక్తల్: పట్టణంలో వీఓఏల సమ్మె కొనసాగుతోంది. ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె ఆగదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించడానికి ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలో వీఓఏల సమ్మె కొనసాగుతోంది. గురువారంకు 11వ రోజు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు బాబు, విష్ణువర్ధన్, రవి, బుగ్గప్ప, కొత్తపల్లి రవి, పావని, మహేశ్వరమ్మ, వెంకటమ్మ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి



రెనివట్లలో పర్యటిస్తున్న ఏఓ ఉదయ్‌కాంత్

మద్దూరు: మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి నష్టపోయిన పంటలను గురువారం ఏఓ ఉదయ్ కాంత్ పరిశీలించారు. రెనివట్ల గ్రామంలో 6 ఎకరాల వరిపంట 33 శాతం పైగా దెబ్బతిన్నదని గుర్తించారు. ఇటీవల కురిసిన వర్షానికి మండలంలో వరి పంట ఎక్కడా ఎక్కువగా దెబ్బతినలేదన్నారు. 33 శాతం కన్నా నష్టం వాటిల్లినది దాదాపు 25 ఎకరాల వరకు ఉంటుందని తెలిపారు. వర్షసూచన కారణంగా రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు మోహన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పని గంటల తగ్గింపే లక్ష్యంగా పోరాడుదాం



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద మేడే వాల్ పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి నర్సింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1886లో చికాగోలో పోరాటం చేసి 8 గంటల పనిని సాధించారు. కానీ ప్రస్తుతం సమయాన్ని 12 గంటలను పెంచడం అంటే రాతియుగంలో పోవడమే అన్నారు. మోదీ ప్రభుత్వం 12 గంటలు కార్మిక వర్గాన్ని పనిచేయమనడం అంటే వెట్టి చాకిరీ చేయించడమే అన్నారు. పని గంటల తగ్గింపే లక్ష్యంగా పోరాటం చేద్దామన్నారు. నాయకులు రాములు, ఆటో వర్కర్స్ నాగప్ప, సాబీర్, హన్మంత్, వెంకటప్ప, రాజు, రవి, వెంకటయ్య నయుం తదితరులు పాల్గొన్నారు.

మరికల్: కార్మికులు మే డే వేడుకలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రామాంజనేయులు అన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్లను గురువారం మరికల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలయ్య, రఘుమూర్తి, రాజు, మోహన్, రాజన్న, సరోజ పాల్గొన్నారు.

ఊట్కూరు: ఐఎఫ్‌టీయూ నాయకులు మేడే వాల్‌పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. అదే విధంగా ఊట్కూరు, పెద్దపొర్ల, అమీన్‌పూర్ గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కూతలి నాగేష్, లింగప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



మరికల్ నుంచి తరలివెళ్తున్న డీలర్లు



ధన్వాడ నుంచి..

మరికల్: గౌరవ వేతనంతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబ్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గురువారం మరికల్ నుంచి మహబూబ్‌నగర్‌కు రేషన్ డీలర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు దుకాణాలను బంద్ చేస్తామన్నారు. ప్రభుత్వం డీలర్ల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో జనార్ధన్, నారాయణ, ముకుందారెడ్డి, నర్సిములు, మంజూల, తిరుపతిరెడ్డి, రాంఎడ్డి, జయమ్మలు పాల్గొన్నారు.

ధన్వాడ: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకుడు బాబా అన్నారు. గౌరవ వేతన సాధన సభ కోసం చేపట్టిన చలో మహబూబ్‌నగర్ కార్యక్రమానికి మండలం నుంచి రేషన్ డీలర్లు గురువారం తరలివెళ్లారు. కడపయ్య, నారాయణ, గోపాల్, వెంకటలక్ష్మి, నారాయణ నాయక్, నర్సిములు తదితరులు ఉన్నారు.